# నాడు మన తెలంగాణ పరాధీనమైందెట్లా?

మొదటిపేజీ తరువాయి...

జరగలేదు. ఇందులో ముఖ్యమైనది ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో రాజకీయ పార్టీల పాత్ర గురించి చేసుకోవాల్సిన విశ్లేషణ. తొమ్మిదేండ్ల తెలంగాణ రాష్ట్ర అస్తిత్వం తర్వాత ఇప్పుడు తెలంగాణకు రాజకీయ పార్టీలు చేసిన అన్యాయాన్ని అంచనా వేసుకోవడం అవసరమా? అని ప్రశ్నలు రావచ్చు. దశాబ్దాలుగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడకపోవటానికి లేక ఆలస్యం కావడానికి కారణం తెలుసుకోకపోతే చరిత్రను సరిగా రికార్డు చేయకపోవటమే కాదు, భవిష్యత్తులో కూడా అప్రమత్తంగా ఉండలేం. 1956లో హైదరాబాద్ రాష్ట్రం అస్తిత్వం కోల్పోయినప్పటి నుంచి 2014లో తెలంగాణ ఏర్పడిన నాటివరకు జరిగిన ఘటనలను, వాటి వెనుక ఉన్న రాజకీయ ద్రోహాన్ని చారిత్రకంగా విశ్లేషణ చేయడమే ఈ వ్యాస పరంపర లక్ష్యం.

> 2012లో 'తెలంగాణ ఇచ్చేదీ మేమే, తెచ్చేదీ మేమే' అనే స్లోగన్‌ను కాంగ్రెస్‌వాళ్లు అందుకున్నారు. ఈ స్లోగన్‌కు కొనసాగింపు 'ఇవ్వకపోతే చచ్చేదీ మేమే' అని తగిలించబడింది. సరిగ్గా ఈ చివరి వాక్యమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ ఒప్పుకునేలా చేసింది.

### అడ్రస్ గల్లంతవుతుందనే..!

ఉద్యమం పతాకస్థాయిలో ఉన్నప్పుడు 2012లో 'తెలంగాణ ఇచ్చేదీ మేమే, తెచ్చేదీ మేమే' అనే స్లోగన్‌ను కాంగ్రెస్‌వాళ్లు అందుకున్నారు. దీనికి కొనసాగింపుగా'ఇవ్వకపోతే చచ్చేదీ మీరే' అని ప్రజలు స్లోగన్ ఇచ్చారు. సరిగ్గా ఈ చివరి వాక్యమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ ఒప్పుకునేలా చేసింది.

**60 ఏండ్ల ద్రోహ చరిత 1**

ఆధునిక తెలంగాణ చరిత్ర నిజాం రాచరికపు కాలం తర్వాత 1 డిసెంబర్ 1949 వరకు మిలిటరీ పాలనలో, 1950 జనవరి నుంచి 1952 ఫిబ్రవరి వరకు ఎంకే వెల్లోడి పౌర ప్రభుత్వంతో మొదలైంది. ఫిబ్రవరి 1952 నుంచి 1956 నవంబర్ 1 వరకు మాత్రమే తెలంగాణ స్వీయ అధికారాన్ని అనుభవించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం పదవ ఏట ప్రవేశిస్తున్నా, తెలంగాణ ఉద్యమం, ఆకాంక్షలు ఎన్నికల్లో ఎజెండాగా మారుతున్న ఈ సందర్భంలో తెలంగాణ రాజకీయ పార్టీలకూ, ప్రత్యేకించి కాంగ్రెస్ పార్టీకి ఉన్న సంబంధం చర్చించకపోతే రికార్డ్ అయిన చరిత్ర సమాచారంగా ఉంటుందే తప్ప చారిత్రక విశ్లేషణగా మారదు.

### తొలిద్రోహం - ఆంధ్రతో విలీనం

నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్ హైదరాబాద్‌పై ఏ ధోరణితో ఉండిందో మాట్లాడాలి. మొదట చాలా ప్రజాస్వామికంగా మాట్లాడిన నెహ్రూ, హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణను ఆంధ్రాతో కలిపేసి చారిత్రక తప్పిదం ఎందుకు చేశారో, తన అభిప్రాయాలకు వ్యతిరేకంగా సోమర్సాల్ట్ (పిల్లిమొగ్గలు) ఎందుకు వేశారో విశ్లేషిస్తేకానీ తెలంగాణ పరాధీన చరిత్రకు బీజం ఎక్కడ పడిందో అర్థం కాదు. చరిత్ర పుటల్ని తిరగేస్తే 14 జూలై, 1951లో హైదరాబాద్‌ను విభజించి భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేయాలన్న ఆంధ్రా నేత అయ్యదేవర కాళేశ్వరరావు ప్రతిపాదనను తోసిపుచ్చి నెహ్రూ అన్న మాటలు వింటే అసలు ఈ నెహ్రూ నేనా తెలంగాణను ఆంధ్రతో కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేసింది అనే ఆశ్చర్యం కలుగుతుంది. 'ఆయన (అయ్యదేవర కాళేశ్వరరావు) మాటలు వింటుంటే నాకు భయం వేసింది. అలాంటిది నేను ఏమీ చేయబోవడం లేదు. ఆయన ఇంకా అట్లానే మాట్లాడితే అసలు ఆంధ్ర రాష్ట్రం అంటూనే ఉండదు' అని కూడా నెహ్రూ బెదిరించిండు. ఇంతేకాదు నిజామాబాద్‌లో తొలిసారి ఆంధ్రాతో తెలంగాణ విలీనం గురించిన ప్రకటన చేస్తూ అమాయకపు పెళ్లికూతురిని గడసరి పెళ్లికొడుక్కి ఇచ్చి పెళ్లి చేస్తున్నట్టు ఉన్నదని వ్యాఖ్యానించారు. 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణ సభలో సైతం ఈ 'పెండ్లిలో' ఉన్న మంచి చెడుల గురించి ప్రస్తావించాడు. ఇన్ని విషయాలు మాట్లాడిన నెహ్రూ ఎందుకు ఆంధ్రతో కలిపేశారన్నదే ప్రశ్న.

### బలవంతపు పెండ్లి చేయించిన పంతుళ్లు ఎవరు?

తెలంగాణకు ద్రోహం చేయడం అప్పటి నుంచే మొదలైంది. కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్న లక్షణం- ఉద్యమించేదీ కాంగ్రెస్సే, ద్రోహం చేసేదీ కాంగ్రెస్సే. తెలంగాణ కాంగ్రెస్ నాయకుల్లో రెండు గ్రూపులుండేవి. ఒకటి విశాలాంధ్రకు మద్దతు ఇచ్చేది, రెండోది తెలంగాణ ప్రత్యేకంగా ఉండాలని కోరుకునేది. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షుడైన స్వామి రామానందతీర్థలాంటి వాళ్లు విశాలాంధ్రను సమర్థించారు. కేవీ రంగారెడ్డి, చెన్నారెడ్డి, జేవీ నరసింగరావు వంటి వాళ్లు ఆంధ్రాతో కలపడాన్ని వ్యతిరేకించారు. ఆ అనుకూలతకు ఈ వ్యతిరేకతకు సైద్ధాంతిక ప్రాతిపదిక ఏమీ లేదు. అదో వర్గం ఇదో వర్గం. ఒకరిపై ఒకరు పైచేయికి యత్నం. రెండు వర్గాలు అనేకసార్లు వర్గవైరుధ్యాలతో రోడ్ల మీద పడ్డాయి. ఈ వైరుధ్యమే తెలంగాణ అనుకూలత వ్యతిరేకతలకు ప్రాతిపదిక. అంతే తప్ప ఒక రాష్ట్రం ఒక స్వాభిమానం ఇవేవీ కావు. అందుకే ఇటు అటు పిల్లిమొగ్గలు. ఉదాహరణకు హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు తొలుత విలీనాన్ని గట్టిగా వ్యతిరేకించి చివరకు మద్దతుదారుడిగా మారిపోయారు. హైదరాబాద్ (తెలంగాణ) కాంగ్రెస్ నాయకుల పిల్లిమొగ్గలకు, అసమర్థ నాయకత్వానికి కారణం కాంగ్రెస్ నిర్మాణంలోనే ఉన్నది.

> 1950ల నుంచే తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఒక డిపెండెంట్ క్లాస్, అంటే ఒక ఆశ్రితవర్గంగా మారిపోయింది. ఫలితమే హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రజలు అస్తిత్వాన్ని కోల్పోయి 58 ఏండ్లు పరాధీనంగా మారిపోవడం.

### కాంగ్రెస్ నమ్మక ద్రోహం

ప్రధాని నెహ్రూ, కేంద్ర హోం మంత్రి గోవింద వల్లభ పంత్, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు యూఎన్ ఢేబర్ ఒత్తిడికి హైదరాబాద్ సీఎం బూర్గుల రామకృష్ణరావు సహా అన్ని స్థాయిల కాంగ్రెస్ నేతలు తలొగ్గి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు వంత పాడారు. 'ఢిల్లీ వెళ్లే ముందు ప్రత్యేక తెలంగాణవాది అయిన బూర్గుల తిరిగి వస్తూనే విమానాశ్రయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వేరుగా ఉండుట నష్టదాయకమని, విశాలాంధ్ర ఏర్పడుట మంచిదని చెప్పిరి' అని కేవీ రంగారెడ్డి స్వీయ చరిత్రలో రాసుకొన్నారు. బూర్గుల అభిప్రాయాన్ని మార్చింది కాంగ్రెస్ అధిష్ఠానం. విశాలాంధ్ర ఏర్పాటుకు సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని, తెలంగాణవాదులను ఒప్పించాలని హైకమాండ్ కాంగ్రెస్ నాయకులకు హుకుం జారీచేసింది. కాంగ్రెస్ కార్యవర్గ నిర్ణయాన్ని అనుసరించాలని బూర్గుల అన్నారు (ఆంధ్రపత్రిక, 17 నవంబర్ 1955). తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు ఢిల్లీ చెప్పే దానికి తలూపడం అనే జబ్బు అప్పటి నుంచే ఉన్నదని దీనిని బట్టే స్పష్టమవుతున్నది. ఇంకోపక్క ఆంధ్ర కాంగ్రెస్ లాబీని అర్థం చేసుకోలేని వెర్రిబాగులతనం కూడా ఉండేది. తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వానికి ఆంధ్రా నాయకులకు దాసోహం అని ప్రకటించుకునే లక్షణం మొదలవుతున్న కాలం ఇది.

కాంగ్రెస్ పార్టీలో ఏ ప్రాంతీయ ఆకాంక్షలైనా కేంద్ర నాయకత్వ ఆధీనంలోనే ఉంటాయని ఆరు దశకాల్లో ప్రతీ సందర్భంలో రుజువవుతూ వచ్చింది. 1950ల నుంచే తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఒక డిపెండెంట్ క్లాస్, అంటే ఒక ఆశ్రితవర్గంగా మారిపోయింది. ఫలితమే హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రజలు అస్తిత్వాన్ని కోల్పోయి 58 ఏండ్లు పరాధీనంగా మారిపోవడం.

### నెహ్రూ దౌత్య వైఫల్యం

తెలంగాణ ప్రత్యేకంగా ఉంటే కేంద్రంలో ఉన్న కాంగ్రెస్‌కు వచ్చే నష్టమేమిటి అనే అంశాన్ని కూడా పరిశీలించాలి. హైదరాబాద్ సంస్థానంపై భారత ప్రభుత్వం పోలీస్ చర్య జరుపటంపై ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో నిజాం ప్రభుత్వం ఇచ్చిన ఫిర్యాదు అప్పటికి ఇంకా ఉన్నది. దీని నుంచి తప్పించుకోవాలంటే నెహ్రూకు హైదరాబాద్ స్టేట్‌లోని ఒక ముక్క కూడా తెలంగాణ రూపంలో ఉండకూడదు. ఈ అంశంపై ఆయన ప్రభుత్వం ఐక్యరాజ్యసమితిలో సమర్థంగా పోరాడలేకపోయింది. నెహ్రూ ముందున్న రాజకీయ కారణం, ఆంధ్ర కాంగ్రెస్ లాబీయింగ్ ప్రభావంలో కాంగ్రెస్ కేంద్ర నాయకులు, తెలంగాణ కాంగ్రెస్ నాయకుల తెలివితక్కువతనంతో కూడిన డిపెండెన్సీ - ఇవన్నీ కలిసి తెలంగాణను ఆంధ్రాకు అప్పచెప్పినాయి.

> తెలంగాణ కాంగ్రెస్ నాయకుల్లో రెండు గ్రూపులుండేవి. ఒకటి విశాలాంధ్రకు మద్దతు ఇచ్చేది, రెండోది తెలంగాణ ప్రత్యేకంగా ఉండాలని కోరుకునేది. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షుడైన స్వామి రామానందతీర్థలాంటి వాళ్లు విశాలాంధ్రను సమర్థించారు. కేవీ రంగారెడ్డి, చెన్నారెడ్డి, జేవీ నరసింగరావు వంటి వాళ్లు ఆంధ్రాతో కలపడాన్ని వ్యతిరేకించారు. ఆ అనుకూలతకు ఈ వ్యతిరేకతకు సైద్ధాంతిక ప్రాతిపదిక ఏమీ లేదు. అదో వర్గం ఇదో వర్గం. ఒకరిపై ఒకరు పైచేయికి యత్నం.. అంతే..

### నెహ్రూతో మొదలు

1956 నుంచి 58 ఏండ్లు తెలంగాణ తన చిరునామాను, అస్తిత్వాన్ని కోల్పోవడానికి కారణం ఎవరు? దీనికి స్పష్టమైన సమాధానం కాంగ్రెస్ పార్టీ. నెహ్రూ, ఇందిర, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ నేతృత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ. ఎందుకంటే హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రతో కలిపేసి ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేసిన నెహ్రూ కాలం నుంచి సోనియాగాంధీ నాటి కాంగ్రెస్ వరకు జరిగిన ఘటనలు, బలవంతపు ఒప్పందాలు, ఉద్యమాలు తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఎత్తి చూపిస్తాయి. ఈ ఆరు దశాబ్దాలలో తెలంగాణ ఉద్యమం తీవ్రంగా ఉన్న కాలాల్లో అధికారంలో ఉన్నది కూడా కాంగ్రెస్సే. ఉద్యమం స్తబ్దంగా ఉన్న కాలాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెసేతర ప్రభుత్వాలు సైతం తెలంగాణ అంశాన్ని ఓట్ల కోసం వాడుకున్నాయే తప్ప ప్రజాస్వామికంగా వ్యవహరించలేదు. ఉద్యమం బలంగా ఉన్నపుడు అందరికంటే ఎక్కువ గొంతేసుకునే కాంగ్రెస్ నాయకులే ఏదో ఒక పదవి ఆశ చూపగానే ఉద్యమం చల్లార్చి సమైక్యరాగాన్ని అందుకునేవారు. ఈ ప్రాంత కాంగ్రెస్ నాయకులు వెన్నెముక లేని డూడూ బసవన్నలు కావడం వల్లనే 'జై తెలంగాణ' అనేవారిని లొంగదీసుకునే ఫార్ములాలో కాంగ్రెస్ అధిష్ఠానం ఆరితేరితే.. ఇటు ఎవరైనా నిజాయితీగా తెలంగాణ అన్నా విశ్వసించలేని స్థితికి ప్రజలూ చేరుకున్నారు.

---

# బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం

**ప్రతి ఒక్కరితో మమేకం కావాలి**

**అసెంబ్లీ ఇన్‌చార్జిలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం**

**తొలి విడత 54 అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిల జాబితా విడుదల**

**పదేండ్ల ప్రగతిని ప్రజలకు వివరించాలి**



హైదరాబాద్, అక్టోబర్12 (నమస్తే తెలంగాణ): పదేండ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేలా అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దులుగా ముందుకు తీసుకెళ్లిన సీఎం కేసీఆర్ నాయకత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రతి ఒక్కరితో మమేకమయ్యేలా పార్టీ ప్రచారం నిర్వహించాలని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలకు సూచించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ సీనియర్ నాయకులను ఆయా అసెంబ్లీల ఇన్‌చార్జిలుగా నియమించారు. 54 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిల తొలి విడత జాబితాను కేటీఆర్ గురువారం విడుదల చేశారు. అనంతరం పార్టీ ఇన్‌చార్జిలతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌కు సానుకూల వాతావరణం ఉన్నదని చెప్పారు. పదేండ్లలో బీఆర్‌ఎస్ సర్కారు చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లి వారిని ఓట్లు అడగాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలకు ఎన్నికలు కేవలం హామీలు ఇచ్చేందుకు వేదికలు మాత్రమేనని, బీఆర్‌ఎస్ పార్టీకి మాత్రం పదేండ్లలో చేసిన ప్రగతిని ప్రజలకు వివరించే ఒక అద్భుతమైన అవకాశమని తెలిపారు. అసెంబ్లీలవారీగా ఇన్‌చార్జిలుగా నియమితులైన ప్రతిఒక్క నాయకుడు ఇప్పటినుంచే పార్టీ విజయానికి అవసరమైన కార్యాచరణ, కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. రేపటి నుంచి ఎన్నికల ఫలితాలు వెలువడే రోజు వరకూ ఆయా నియోజకవర్గాల సంపూర్ణ బాధ్యతను తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులన్నింటిని సమన్వయం చేసుకొని, పార్టీ ప్రచార బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు.

### బీఆర్‌ఎస్ గెలుపుకోసం శ్రమించాలి: మంత్రి హరీశ్‌రావు

టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు పార్టీ ఇన్‌చార్జిలకు పలు సలహాలు, సూచనలు అందించారు. రాబోయే 5 రోజులపాటు నియోజకవర్గంలోనే ఉంటూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల నిర్వహణ మొదలుకొని నియోజకవర్గస్థాయి వరకు అన్ని దశల్లో పార్టీ ప్రచారం పకడ్బందీగా ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని తెలిపారు ఇన్‌చార్జిలుగా కార్యకర్తలు చేపట్టాల్సిన కార్యక్రమాలపైన ప్రత్యేకంగా మాట్లాడారు. తమకు బాధ్యత అప్పజెప్పిన కార్యక్షేత్రంలో పదేండ్లలో జరిగిన మంచి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు పోవాలని సూచించారు. ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధిస్తుందని తెలిపిన హరీశ్‌రావు.. ఆ దిశగా ఈ 45 రోజులపాటు విస్తృతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**బీఆర్‌ఎస్ ఎలక్షన్ క్యాంపెయిన్ నియోజకవర్గ ఇన్‌చార్జిల జాబితా**

| నియోజకవర్గం | ఇన్‌చార్జి పేరు |
|---|---|
| 1. బెల్లంపల్లి (ఎస్సీ) | వెంకటేశ్ నేత (ఎంపీ) |
| 2. మంచిర్యాల | భానుప్రసాద్‌రావు (ఎమ్మెల్సీ) |
| 3. ఖానాపూర్ (ఎస్టీ) | దండె విఠల్ (ఎమ్మెల్సీ) |
| 4. బోథ్ (ఎస్టీ) | నగేశ్ (మాజీ ఎంపీ) |
| 5. ముథోల్ | పురాణం సతీశ్‌కుమార్ (మాజీ ఎమ్మెల్సీ) |
| 6. బోధన్ | కల్వకుంట్ల కవిత (ఎమ్మెల్సీ) |
| 7. ఎల్లారెడ్డి | వీ గంగాధర్‌గౌడ్ (మాజీ ఎమ్మెల్సీ) |
| 8. కామారెడ్డి | గంప గోవర్ధన్ (ఎమ్మెల్యే), శేరి సుభాశ్‌రెడ్డి (ఎమ్మెల్సీ), మంత్రి కేటీఆర్ (ఇన్‌చార్జి) |
| 9. నిజామాబాద్ అర్బన్ | కల్వకుంట్ల కవిత (ఎమ్మెల్సీ) |
| 10. జగిత్యాల | ఎల్ రమణ (ఎమ్మెల్సీ), రాజేశంగౌడ్ (మాజీ మంత్రి) |
| 11. రామగుండం | నారదాసు లక్ష్మణ్ (మాజీ ఎమ్మెల్సీ) |
| 12. మంథని | ఈద శంకర్‌రెడ్డి (మాజీ చైర్మన్) |
| 13. పెద్దపల్లి | రవీందర్‌సింగ్ (చైర్మన్) |
| 14. చొప్పదండి (ఎస్సీ) | గంగుల కమలాకర్ (మంత్రి) |
| 15. వేములవాడ | బీ వినోద్‌కుమార్ (మాజీ ఎంపీ) |
| 16. మానకొండూరు (ఎస్సీ) | జీవీ రామకృష్ణ (సుడా చైర్మన్) |
| 17. మెదక్ | టీ తిరుపతిరెడ్డి (మెదక్) |
| 18. ఆందోల్ (ఎస్సీ) | ఫారూఖ్ హుస్సేన్ (మాజీ ఎమ్మెల్సీ) |
| 19. నర్సాపూర్ | వెంకట్రాంరెడ్డి (ఎమ్మెల్సీ) |
| 20. జహీరాబాద్ (ఎస్సీ) | దేవీప్రసాద్ (మాజీ చైర్మన్) |
| 21. సంగారెడ్డి | వీ భూపాల్‌రెడ్డి (చైర్మన్), ఎర్రోళ్ల శ్రీనివాస్ (చైర్మన్) |
| 22. దుబ్బాక | బాలమల్లు (చైర్మన్) |
| 23. గజ్వేల్ | హరీశ్‌రావు (మంత్రి), డాక్టర్ యాదవరెడ్డి (ఎమ్మెల్సీ), వీ ప్రతాప్‌రెడ్డి (చైర్మన్) |
| 24. మల్కాజిగిరి | శంభీపూర్ రాజు (ఎమ్మెల్సీ) |
| 25. ఉప్పల్ | రావుల శ్రీధర్‌రెడ్డి (చైర్మన్) |
| 26. ఇబ్రహీంపట్నం | తీగల కృష్ణారెడ్డి (మాజీ ఎమ్మెల్యే) |
| 27. చేవెళ్ల (ఎస్సీ) | రంజిత్‌రెడ్డి (ఎంపీ) |
| 28. వికారాబాద్ (ఎస్సీ) | రంజిత్‌రెడ్డి (ఎంపీ) |
| 29. ముషీరాబాద్ | ఎంఎస్ ప్రభాకర్ (ఎమ్మెల్సీ) |
| 30. అంబర్‌పేట | కట్టెల శ్రీనివాస్‌యాదవ్, మోహన్‌రావు (అడ్వొకేట్) |
| 31. సికింద్రాబాద్ కంటోన్మెంట్ (ఎస్సీ) | తలసాని శ్రీనివాస్‌యాదవ్ (మంత్రి) |
| 32. మక్తల్ | ఆంజనేయగౌడ్ (చైర్మన్) |
| 33. గద్వాల్ | రాకేశ్ చిరుమళ్ల (మాజీ చైర్మన్) |
| 34. అలంపూర్ (ఎస్సీ) | చల్లా వెంకట్రాంరెడ్డి (ఎమ్మెల్సీ) |
| 35. అచ్చంపేట (ఎస్సీ) | ఇంతియాజ్ ఇషాక్ (చైర్మన్) |
| 36. కల్వకుర్తి | గోలి శ్రీనివాస్‌రెడ్డి (చైర్మన్) |
| 37. కొల్లాపూర్ | పీ రాములు (ఎంపీ) |
| 38. నాగార్జునసాగర్ | కోటిరెడ్డి (ఎమ్మెల్సీ), రామచంద్రునాయక్ |
| 39. హుజూర్‌నగర్ | విజయసింహారెడ్డి (నల్లగొండ) |
| 40. కోదాడ | టీ రవీందర్‌రావు (ఎమ్మెల్సీ) |
| 41. నల్లగొండ | బండా నరేందర్‌రెడ్డి (జడ్పీ చైర్మన్) |
| 42. నకిరేకల్ (ఎస్సీ) | బడుగుల లింగయ్యయాదవ్ (ఎంపీ) |
| 43. జనగామ | బీ వెంకటేశ్వర్లు (మాజీ ఎమ్మెల్సీ), డాక్టర్ రాజయ్య (చైర్మన్), హరీశ్‌రావు (ఇన్‌చార్జి) |
| 44. మహబూబాబాద్ (ఎస్టీ) | సత్యవతి రాథోడ్ (మంత్రి) |
| 45. నర్సంపేట | వీ ప్రకాశ్ (చైర్మన్) |
| 46. వరంగల్ ఈస్ట్ | బండా ప్రకాశ్ (మండలి డిప్యూటీ చైర్మన్) |
| 47. భూపాలపల్లి | బస్వరాజు సారయ్య (ఎమ్మెల్సీ) |
| 48. ములుగు (ఎస్టీ) | పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి (ఎమ్మెల్సీ) |
| 49. ఇల్లెందు (ఎస్టీ) | వద్దిరాజు రవిచంద్ర (ఎంపీ) |
| 50. మధిర (ఎస్సీ) | పువ్వాడ అజయ్‌కుమార్ (మంత్రి), కొండబాల కోటేశ్వరరావు |
| 51. వైరా (ఎస్టీ) | నామా నాగేశ్వరరావు (ఎంపీ) |
| 52. సత్తుపల్లి (ఎస్సీ) | పార్థసారథిరెడ్డి (ఎంపీ) |
| 53. అశ్వారావుపేట (ఎస్టీ) | శేషగిరిరావు (డీసీఎంఎస్ ఖమ్మం) |
| 54. భద్రాచలం (ఎస్టీ) | తాతా మధు (ఎమ్మెల్సీ) |

---

### హింసాత్మక వీడియోలు షేర్ చేస్తే కఠిన చర్యలు


**మణిపూర్ ప్రభుత్వం నిర్ణయం**

ఇంఫాల్, అక్టోబర్ 12: హింసాత్మక వీడియోల వ్యాప్తిని అడ్డుకోవడానికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మణిపూర్ ప్రభుత్వం నిర్ణయించింది. హింసాత్మక ఘటనలు, ఆస్తుల విధ్వంసానికి సంబంధించిన వీడియోలను షేర్ చేసేవారి పట్ల చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని బుధవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల కుకీ భాష మాట్లాడే కొందరు వ్యక్తులు ఇద్దరు మైతీ యువకులను పాయింట్ బ్లాంక్ తుపాకీతో కాల్చి చంపి గోతిలో పాతిపెట్టే వీడియో వైరల్ అయిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది. ఎవరి వద్ద అయినా హింసాత్మక చిత్రాలు, వీడియోలు ఉంటే వారు సమీపంలో ఎస్పీ కార్యాలయానికి వాటిని అందజేసి పోలీసులు తగిన చర్యలు తీసుకొనేందుకు సహకరించాలని ఆదేశించింది.

---

# చికెన్ బిర్యానీ 140.. టిఫిన్ 35

- అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు ఖరారు
- గరిష్ఠంగా చేయాల్సిన వ్యయం 40 లక్షలే..
- జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం



హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ప్రచార ఖర్చులను ఎన్నికల సంఘం ఖరారు చేసింది. దేనికి ఎంత వ్యయం చేయాలో సూచించింది. అభ్యర్థులు గతంలో తమ ఖర్చులను తక్కువగా చూపించేవారు. ఈ సారి ఎన్నికల అధికారులే ధరల జాబితాను రెడీ చేశారు. దాని ప్రకారం ఎన్నికల వ్యయాన్ని లెక్కించనున్నారు. నీళ్ల ప్యాకెట్ నుంచి సభలు, సమావేశాలు ఏర్పాటు చేసే హోర్డింగ్స్, బెలూన్స్, ఎల్‌ఈడీ తెరలకు సైతం ధరలను నిర్ణయించారు. ఈసారి ఎన్నికల వ్యయాన్ని కూడా ఈసీ పెంచింది. అభ్యర్థి ఖర్చుల వ్యయం గరిష్ఠంగా రూ.28 లక్షలు ఉండగా, దానిని ఈసారి రూ.40 లక్షలు చేసింది.

**ఈసీ ధరల జాబితా ఇలా..**

| | పట్టణ ప్రాంతంలో (రూ.ల్లో) | గ్రామీణ ప్రాంతంలో (రూ.ల్లో).. |
|---|---|---|
| వెజ్ బిర్యానీ | 80 | 70 |
| చికెన్ బిర్యానీ | 140 | 100 |
| మటన్ బిర్యానీ | 180 | 150 |
| భోజనం | 80 | 70 |
| టిఫిన్ | 35 | 30 |
| టీ | 15 | 10 |
| పులిహోర | 30 | 20 |
| నీళ్ల బాటిల్ | 20 | 20 |
| పెద్ద సమోసా(ఒక్కటి) | 10 | 10 |
| ఎల్ ఈడీ స్క్రీన్ (రోజుకు) | 15,000 | 12,000 |
| ఫంక్షన్‌హాల్ | 15.000 | 12,000 |
| డ్రోన్ కెమెరా (రోజుకు) | 5,000 | 5,000 |
| పెద్దబస్సుకు (రోజుకు) | 6,000 | 6,000 |
| ఇన్నోవా కారు (రోజుకు) | 4,000 | 4,000 |
| మినీ బస్సు (రోజుకు) | 3,500 | 3,500 |
| డీసీఎం (రోజుకు) | 3,000 | 3,000 |
| ఒక్కో బెలూన్ | 4,000 | 4,000 |

---

# చేనేతపై కేంద్రం కాఠిన్యం

- అనేక పథకాలు రద్దు చేసిన మోదీ ప్రభుత్వం
- ముడిసరుకుల ధరలకు రెక్కలు, పన్నుల భారం
- నేతన్నలపై పిడుగులా 5-12 శాతం జీఎస్టీ విధింపు
- రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులనూ పట్టించుకోని బీజేపీ సర్కార్



హైదరాబాద్, అక్టోబర్ 12(నమస్తే తెలంగాణ): దేశంలో వ్యవసాయం తరువాత ఎక్కువ మందికి ఉపాధి చూపిస్తున్న చేనేత రంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. రెక్కాడితేగాని డొక్కాడని నేతన్నలపై కాఠిన్యం ప్రదర్శించింది. ప్రధాని మోదీ పాలనలో కొత్త పథకాలేవీ ప్రకటించకపోగా గతంలో ఉన్న కొన్ని మంచి పథకాలను సైతం రద్దుచేసింది. ముడి సరుకు ధరలను విపరీతంగా పెంచింది. పన్నుల భారం మోపింది.

### చేనేతరంగాన్ని దెబ్బతీసిన మోదీ ప్రభుత్వ నిర్ణయాల్లో కొన్ని..

- చేనేత కార్మికులు కొనుగోలు చేసే నూలుపై, అమ్మే వస్త్రాలపై జీఎస్టీని 5% నుంచి 12% వరకు పెంచింది. చేనేత ఉత్పత్తులపై అసలు జీఎస్టీ విధించవద్దన్న వివిధ వర్గాల విజ్ఞప్తులను నిర్లక్ష్యం చేసింది.
- ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డును 2020 జూలై 27న రద్దుచేసింది. దీంతో చేనేత రంగ అభివృద్ధి, పరిరక్షణకు నిర్ణయాధికార సంస్థ లేకుండా పోయింది.
- ఆల్ ఇండియా హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డును 2020 ఆగస్టు 7న రద్దుచేసింది.
- ఆల్ ఇండియా పవర్‌లూం బోర్డును 2020 ఆగస్టు 11న రద్దుచేసింది. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న ఎనిమిది టెక్స్‌టైల్ పరిశోధనా సంస్థలు నిర్వీర్యం అయ్యాయి.
- చేనేత రంగ అవసరాలకు సరఫరా చేయాల్సిన చిలప నూలు తయారీ కోసం నిర్దేశించిన హాంక్ యార్న్ ఆబ్లిగేషన్ ఆర్డర్ ఏను నిర్వీర్యం చేసింది. కేంద్రం మొదట చిలప నూలు శాతాన్ని 40% నుంచి 15 శాతానికి తగ్గించింది. దీని ద్వారా మార్కెట్‌లో చిలప నూలు లభ్యత తగ్గిపోయి ధరలు పెరిగి చేనేత రంగం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.
- చేనేత సహకార సంఘ సభ్యుల థ్రిఫ్ట్ ఫండ్ పథకంలో కేంద్రం వాటాగా ఉన్న 4 శాతాన్ని రద్దుచేసింది.
- చేనేత కార్మికుల కోసం ఉద్దేశించిన లంబార్డ్ హెల్త్ ఇన్సురెన్స్ స్కీంను రద్దుచేసింది.
- చేనేత కార్మికులకు ఉద్దేశించిన మహాత్మా గాంధీ బున్‌కర్ బీమా యోజన పథకాన్ని 2014లోనే రద్దుచేసింది.
- చేనేత కార్మికుల కోసం ఉద్దేశించిన హౌస్-కం-వర్క్ షెడ్ పథకాలన్నింటినీ 2014లోనే రద్దు చేసింది.
- మార్కెటింగ్ ఇన్సెంటివ్ పథకం నిబంధనలను కఠిననతరం చేయడంతో ఇది నిర్వీర్యం అయిపోయింది.
- హైదరాబాద్‌లో నేషనల్ టెక్స్‌టైల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌తోపాటు హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని బుట్టదాఖలు చేసింది.
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు విజ్ఞప్తిని పట్టించుకోలేదు.
- రాష్ట్రంలో 66 బ్లాక్ లెవల్ హ్యాండ్లూమ్ క్లస్టర్ల ఏర్పాటు కోసం ప్రతిపాదన పంపగా, 30 బ్లాక్ లెవల్ హ్యాండ్లూమ్ క్లస్టర్లు మాత్రమే మంజూరుచేసి, అందులో కేవలం 24 క్లస్టర్లకు మాత్రమే నిధులు విడుదల చేసింది. మిగిలిన 36 క్లస్టర్ల ప్రతిపాదనలు పెండింగ్‌లోనే ఉన్నాయి.
- చేనేత రంగంపై కేంద్రం చిన్నచూపు వల్ల, ముడిసరుకు (నూలు) ధరలు విపరీతంగా పెరిగాయి. దీనివల్ల చేనేత, జౌళి, వస్త్రాల ధరలు పెరిగి డిమాండ్ తగ్గిపోయింది.

### నేతన్నను ఆదుకున్న తెలంగాణ ప్రభుత్వం

తెలంగాణలో లక్షలాదిమందికి చేనేతరంగం జీవనాధారం. ఉమ్మడి రాష్ట్రంలో వారి బతుకులు అత్యంత దుర్భరంగా ఉండేవి. చేనేత కార్మికుల ఆత్మహత్యలు జరిగేవి. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, అమలుచేసిన పథకాలతో చేనేతరంగం కొత్త జవసత్వాలు సంతరించుకున్నది. తెలంగాణ ప్రభుత్వ పథకాలకు తోడుగా కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూల నిర్ణయాలు తీసుకొని ఉంటే చేనేతరంగానికి మరింత లాభం చేకూరేది.

---

### సిలిండర్ల కుంభకోణంలో ఏ-2 నిందితుడి అరెస్టు

- రూ.1.22 కోట్ల స్కాంలో 26 ఏండ్లుగా పరారీ
- ఒడిశాలో అశోక్ అరెస్టు



హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): బిర్లా బ్లూ ఫ్లేమ్స్ లిమిటెడ్ పేరిట 26 ఏండ్ల క్రితం సిలిండర్ల కుంభకోణంలో ఏ-2 నిందితుడు, జగ్మితా ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ చైర్మన్ అశోక్ బిస్వాస్‌ను ఎట్టకేలకు తెలంగాణ సీఐడీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టినట్టు సీఐడీ ఏడీజీ మహేశ్ భగవత్ తెలిపారు. అతి తక్కువ ధరకే సిలిండర్లు ఇస్తామని ఛత్తీస్‌గఢ్ కేంద్రం గా 'బిర్లా బ్లూ ఫ్లేమ్స్ లిమిటెడ్' కంపెనీని ఏర్పాటు చేశారు. దాని ద్వారా 1994 నుంచి 1995 వరకు ఆంధ్రప్రదేశ్‌సహా వివిధ రాష్ట్రాల్లో ప్రజల నుంచి రూ.1,22,91,200 వసూలు చేశారు. డబ్బు చెల్లించిన వారికి సిలిండర్లు ఇవ్వకపోవడంతో ఒడిశాకు చెందిన పలువురు బాధితులు బిర్లా బ్లూ ఫ్లేమ్స్ సంస్థపై కేసు వేశారు. ఈ కేసును తెలంగాణ సీఐడీకి బదిలీ చేశారు. ఇటీవల పెండింగ్ నాన్ బెయిలబుల్ కేసులను పరిష్కరించే క్రమంలో ఈ కేసు వివరాలు సీఐడీ చీఫ్ మహేశ్ భగవత్ తెలుసుకున్నారు. ఎన్‌బీడబ్ల్యూ విభాగం ఎస్పీ రాంరెడ్డికి ఈ కేసు బాధ్యతలను అప్పగించారు. ఆయన నేతృత్వంలోని ప్రత్యేక బృందం ఒడిశాకు వెళ్లి ఈ కేసులో ఏ-2 నిందితుడు అశోక్ బిస్వాస్‌ను అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. సీఐడీ ప్రత్యేక బృందానికి త్వరలో రివార్డులు అందజేస్తామని ఏడీజీ మహేశ్ భగవత్ తెలిపారు.